పుణె X హర్యానా

ప్రొ కబడ్డీ లీగ్ ఫైనల్

హైదరాబాద్ వేదికగా బిగ్ ఫైట్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్ ఫైనల్‌కు రంగం సిద్ధమైంది. శుక్రవారం జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో పుణెరీ పల్టన్, హర్యానా స్టీలర్స్ మధ్య తుదిపోరు జరగనుంది. ఇరు జట్లలో ఏది గెలిచినా వారికి ఇదే తొలి టైటిల్ కానుంది. ప్రొ కబడ్డీ లీగ్‌లో పుణెరీ పల్టన్ రెండోసారి ఫైనల్లో పోటీపడుతుండగా.. హర్యానా స్టీలర్స్ తొలిసారి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. నిరుడు ఫైనల్లో ఓడిన పుణెరీ ఈ సారి ఫుల్ జోష్ కనబర్చి.. గ్రూప్ దశలో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు సీజన్ ఆరంభం నుంచి నిలకడైన ప్రదర్శన చేస్తున్న హర్యానా స్టీలర్స్ అదే ఊపులో టైటిల్ పట్టాలని చూస్తున్నది.

బ్లాక్‌హాక్స్ మరో పరాజయం

చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్ రెండో సీజన్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ పరాజయాల పరంపర కొనసాగుతున్నది. గ్రూప్ దశలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో బ్లాక్‌హాక్స్ నాలుగో ఓటమి మూటగట్టుకుంది. గురువారం జరిగిన పోరులో హైదరాబాద్ 8-15, 8-15, 15-11, 18-20తో కోల్‌కతా థండర్‌బోల్ట్స్ చేతిలో ఓడింది. బ్లాక్‌హాక్స్ కీలక ప్లేయర్లు హేమంత్, జోసెఫ్, లాల్ సుజన్ అంచనాలను అందుకోలేకపోయారు. కోల్‌కతా తరపున వినీత్, అమిత్, కుకూర్‌లు ఆకట్టుకున్నారు. హైదరాబాద్ బ్లాక్‌హాక్స్‌కు ఇది వరుసగా మూడో ఓటమి కాగా.. కోల్‌కతా ప్లేయర్ వినీత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

శ్రీనిధి, మహమ్మదన్ మ్యాచ్ 'డ్రా'

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఐ లీగ్‌లో భాగంగా మహమ్మదన్ ఎఫ్‌సీతో జరిగిన పోరును శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ 'డ్రా' చేసుకుంది. గురువారం హోరాహోరీగా సాగిన పోరు చివరకు 1-1తో సమమైంది. మ్యాచ్ ఆరంభంలోనే డేవిడ్ చేసిన గోల్‌తో శ్రీనిధి జట్టు ఆధిక్యంలోకి దూసుకెళ్లగా.. మరి కాసేపట్లో మ్యాచ్ ముగుస్తుందనగా.. మహమ్మదన్ జట్టు సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ జాసిమ్ గోల్ చేసి స్కోర్లు సమం చేశాడు. లీగ్‌లో 16 మ్యాచ్‌లు ఆడిన శ్రీనిధి డెక్కన్ టీమ్ 33 పాయింట్లతో పట్టిక రెండో స్థానంలో కొనసాగుతుండగా.. మమ్మదన్ జట్టు 35 పాయింట్లతో టాప్‌లో ఉంది.

క్వార్టర్స్‌లో సహజ

గురుగ్రామ్: భారత యువ టెన్నిస్ ప్లేయర్ యామలపల్లి సహజ ఐటీఎఫ్ మహిళల ఓపెన్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో 7-6 (10/8), 7-5తో భారత్‌కే చెందిన రియా భాటియాపై విజయం సాధించింది. తొలి సెట్‌లో ఇరువురు ప్లేయర్లు హోరాహోరీగా పోరాడగా.. టై బ్రేకర్‌లో సహజ ముందడుగు వేసింది. ఇక రెండో సెట్ ఆరంభం నుంచే పకడ్బందీ షాట్లతో విరుచుకుపడిన సహజ క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టింది. మరోమ్యాచ్‌లో భారత టాప్ ర్యాకర్ అంకిత రైనా కూడా గెలిచి క్వార్టర్స్‌కు చేరింది.

గ్రీన్ సెంచరీ

వెల్లింగ్‌టన్: కామెరూన్ గ్రీన్ (103 నాటౌట్; 16 ఫోర్లు) అజేయ సెంచరీతో చెలరేగడంతో న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 9 వికెట్ల నష్టానికి 279 పరుగులు చేసింది. లబుషేన్ (1), హెడ్ (1), కారీ (10) విఫలంకాగా.. మిషెల్ మార్ష్ (40), స్మిత్ (31), ఖవాజా (33) తలా కొన్ని పరుగులు చేశారు. కివీస్ బౌలర్లలో హెన్రీ 4 వికెట్లు పడగొట్టాడు.

ఉగాండా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ చాలెంజ్‌లో కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ షట్లర్ మేఘన రెడ్డిని గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు.

డబ్ల్యూపీఎల్ రెండో సీజన్

ఢిల్లీ ధమాకా!

బెంగళూరుపై జయకేతనం • షఫాలీ, కాప్ మెరుపులు

క్రీజులోకి వచ్చిన వాళ్లు వచ్చినట్లు.. బాదుడే పరమావధిగా చెలరేగిపోవడంతో మహిళల ప్రీమియర్‌లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ రెండో విజయం నమోదు చేసుకుంది. యువ ఓపెనర్ షఫాలీ వర్మ ప్రత్యర్థి బౌలర్లను చెడుగుడు ఆడుకోగా.. కాప్సీ, కాప్, జెస్ మెరుపులు మెరిపించడంతో ఢిల్లీ కొండంత స్కోరు చేసింది. భారీ లక్ష్యఛేదనలో బెంగళూరు కెప్టెన్ స్మృతి మంధన దంచికొట్టినా.. ఫలితం లేకపోయింది!

బెంగళూరు: బ్యాటర్లు విజృంభించడంతో మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ రెండో విజయం నమోదు చేసుకుంది. గురువారం జరిగిన పోరులో ఢిల్లీ 25 పరుగుల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరును చిత్తుచేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ (31 బంతుల్లో 50; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగగా.. అలికా కాప్సీ (46; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), మరినే కాప్ (16 బంతుల్లో 32; 2 ఫోర్లు, 3 సిక్సర్లు), జెస్ జాన్సన్ (16 బంతుల్లో 36; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) దంచికొట్టారు. కెప్టెన్ మెగ్ లానింగ్ (11), జెమీమా రోడ్రిగ్స్ (0) విఫలమయ్యారు. ప్రత్యర్థి బౌలర్లలో సోఫియా డివైన్, డి క్లెర్క్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం భారీ లక్ష్యఛేదనలో బెంగళూరు 9 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసింది. కెప్టెన్ స్మృతి మంధాన (43 బంతుల్లో 74; 10 ఫోర్లు, 3 సిక్సర్లు) ఉన్నంతసేపు ధాటిగా ఆడగా.. తెలుగమ్మాయి సబ్బినేని మేఘన (36), సోఫియా డివైన్ (23) ఆమెకు అండగా నిలిచారు. సాధించాల్సిన రన్‌రేట్ ఎక్కువగా ఉండటంతో పాటు.. మిడిలార్డర్ విఫలమవడంతో బెంగళూరుకు ఓటమి తప్పలేదు. ఒక దశలో 112/1తో పుల్ జోష్‌లో కనిపించిన బెంగళూరు.. లక్ష్యాన్ని ఛేదించేసేలా కనిపించినా.. ఢిల్లీ బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టా మ్యాచ్‌ను క్యాపిటల్స్ వశం చేశారు. జెస్ జాన్సన్ 3, మరినే కాప్, అరుంధతి రెడ్డి చెరో రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. ఈ విజయంతో ఢిల్లీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరింది. ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన మరినె కాప్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. లీగ్‌లో భాగంగా శుక్రవారం గుజరాత్ జెయింట్స్‌తో యూపీ వారియర్స్ అమీతుమీ తేల్చుకోనుంది.

స్మృతి (74)

సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ: 194/5 (షఫాలీ 50, కాప్సీ 46; సోఫియా 2/23, డి క్లెర్క్ 2/35), **బెంగళూరు:** 169/9 (స్మృతి 74, మేఘన 36; జెస్ 3/21, కాప్ 2/35).

షఫాలీ (50)

రాహుల్ ఔట్.. బుమ్రా ఇన్

ఇంగ్లండ్‌తో ఐదో టెస్టుకు జట్టు ప్రకటన

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టుకు విశ్రాంతి తీసుకున్న టీమ్‌ఇండియా ఏస్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా.. తిరిగి జట్టులోకి వచ్చాడు. గాయం కారణంగా టీమ్‌కు దూరమైన కేఎల్ రాహుల్.. ఈ మ్యాచ్‌కు కూడా అందుబాటులో ఉండడని బీసీసీఐ వెల్లడించింది. ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను రోహిత్ సేన ఇప్పటికే 3-1తో కైవసం చేసుకోగా.. నామమాత్రమైన చివరి టెస్టు ఈ నెల 7 నుంచి ధర్మశాలలో జరగనుంది. పేస్‌కు సహకరించనున్న ధర్మశాల పిచ్‌పై బుమ్రా అనుభవం జట్టుకు ఎంతగానో ఉపయోగపడుతుందని భావించిన సెలెక్షన్ కమిటీ అతడిని జట్టులోకి ఎంపిక చేసింది. సిరీస్‌లో భాగంగా హైదరాబాద్ వేదికగా జరిగిన తొలి టెస్టులో రాణించిన కేఎల్ రాహుల్.. ఆ తర్వాత గాయం బారిన పడి జట్టుకు దూరమయ్యాడు. నాలుగో మ్యాచ్‌కు ముందే 90 శాతం ఫిట్‌నెస్ సాధించిన రాహుల్ రాంచీ టెస్టు ఆడుతాడనుకుంటే.. అనూహ్యంగా దూరమయ్యాడు. ఇప్పుడు చివరి పోరుకు కూడా అతడి పేరు లేకుండానే బోర్డు జట్టును ప్రకటించింది. మరోవైపు ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను రంజీ ట్రోఫీ సెమీస్ ఆడేందుకు బోర్డు అనుమతిచ్చింది.

చివరి టెస్టుకు భారత జట్టు: రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, రజత్, సర్ఫరాజ్, ధ్రువ్, కేఎస్ భరత్, దేవదత్ పడిక్కల్, అశ్విన్, జడేజా, అక్షర్, బుమ్రా, కుల్దీప్, సిరాజ్, ముఖేశ్, ఆకాశ్‌దీప్.

చాంపియన్ ఖమ్మం

ఎస్‌జీఎఫ్ క్రికెట్ టోర్నీ

జడ్చర్ల టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-14 బాలుర క్రికెట్ టోర్నీలో ఖమ్మం జట్టు చాంపియన్‌గా నిలిచింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మినీ స్టేడియంలో గురువారం జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో ఖమ్మం 36 పరుగులతో రంగారెడ్డిపై గెలిచింది. అంతకుముందు జరిగిన సెమీఫైనల్స్‌లో మహబూబ్‌నగర్‌పై ఖమ్మం.. హైదరాబాద్‌పై రంగారెడ్డి నెగ్గి తుదిపోరుకు అర్హత సాధించారు. విజేతలకు జడ్చర్ల తాశీల్దార్ సత్యానారాయణ రెడ్డి, ఎంఈవో మంజులా దేవి బహుమతులు ప్రదానం చేశారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.